సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం ၊ 1 ၊ మే ၊ 2023



బ్రహ్మయ్య పండుగ.. ఆనందం నిండుగ

బ్రహ్మంగారి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. -8లో..



ఆనందం పదిలం

కడపలోని రిమ్స్‌లో 2007 బ్యాచ్‌కు చెందిన 149 మంది వైద్య విద్యార్థులు ఆదివారం ప్రత్యేకంగా కలిశారు. తమ అనుబంధాలను పంచుకున్నారు. -8లో..



ఘనంగా వాసవీ మాత జయంతి

ప్రొద్దుటూరులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం శ్రీవాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. -8లో..

న్యూస్‌రీల్

నేటినుంచి కేజీసెట్ -2కే23 పరీక్ష

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల వారు మే 1వ తేదీ నుంచి 4 వరకు ఆన్‌లైన్‌లో కేజీసెట్–2కే23 నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. రోజుకు రెండు విడతల్లో జరిగే పరీక్షకు రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి 5,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కేజీసెట్ 2కే23ని ఏపీ ఎంసెట్ తరహాలో ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తామన్నారు. ఇంకా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి(నాని) అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, కేజీసెట్ -2కే23 కన్వీనర్ కిషోర్‌కుమార్, కళాశాల అడ్మిషన్ కమిటీ డీన్ రామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) ఇన్‌చార్జి పర్యవేక్షక ఇంజినీర్‌గా ఎల్. నరసింహప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న మునిశంకరయ్య ఉద్యోగ విరమణ చేయడంతో కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న నరసింహ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మాతృశాఖకు మెప్మా పీడీ

కడప కార్పొరేషన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న రామమోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. తన మాతృశాఖ అయిన ఉపాధి కల్పనా శాఖలో రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారిగా ఆయన బదిలీ అయ్యారు. రామమోహన్‌రెడ్డి స్థానంలో నూతన మెప్మా పీడీ(ఎఫ్ఏసీ)గా సురేష్ రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఇదే శాఖలో ఏటీగా పనిచేస్తున్నారు. ఇటీవల సురేష్‌రెడ్డి పదోన్నతిపై అన్నమయ్య జిల్లా మెప్మా పీడీగా నియమితులయ్యారు. ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా పీడీ రామమోహన్‌రెడ్డి బదిలీ కావడంతో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాధ్యతలు చేపట్టనున్నారు.

కబడ్డీ జట్టు పయనం

కడప స్పోర్ట్స్ : తిరుపతిలో మేనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా కబడ్డీ జట్టు పయనమైంది. ఆదివారం కడప లోని స్టెప్ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రదర్శన కనబరచాలన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రదర్శనతో విజేతలుగా తిరిగి రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవిని దృష్టిలో పెట్టుకుని కడప–తిరుపతి మధ్య సోమవారం నుంచి నాన్‌స్టాప్ ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, కడపజోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి, ఆర్ఎం గోపాల్‌రెడ్డిలు ఉదయం 11 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో వీటిని ప్రారంభించనున్నారు. ఈ బస్సులు ప్రతిరోజు ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు ప్రతి గంటకు ఒకటి చొప్పున ఉంటాయి. ఈ బస్సుల్లో పెద్దలకు రూ. 340, పిల్లలకు రూ. 260 ఛార్జిగా నిర్ణయించారు.

పల్లెకు సామాజిక చేయూత

- వాటర్‌షెడ్ పథకంలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు
- ఎంపికైన తొమ్మిది మండలాల్లోని 37 గ్రామాల్లో పనులు
- బడ్జెట్ రూ. 1.74 కోట్లు కాగా రూ. 1.64 కోట్లకు అనుమతులు
- ప్రజల్లో అవగాహన కోసమే ఈ పనుల నిర్వహణ



బి.కోడూరు మండలం పెద్దుళ్లపల్లె గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలు

కడప సిటీ: వాటర్‌షెడ్ పథకం అంటేనే అందరూ నీటికి సంబంధించిన పనుల నిర్వహణ అని అనుకుంటారు. కానీ ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన వాటర్‌షెడ్ విభాగంలో భాగంగా ఎంట్రీ పాయింట్ యాక్టివిటీ (ఈపీఏ–ప్రాదేశిక కార్యక్రమం)లో భాగంగా ఎంపికైన మండలాల్లోని గ్రామాల్లో సమాజ సేవకు అవసరమైన వివిధ పనులను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వాటర్‌షెడ్ పథకంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఇందుకు సమకూరుస్తాయి. మొత్తం బడ్జెట్ రూ. 1.74 కోట్లు కాగా ఇప్పటికే రూ. 1.64 కోట్లకు పరిపాలన అనుమతులు పొంది రూ. 98.62 లక్షల నిధులకు సంబంధించి వివిధ పనులను చేశారు. మొత్తం 161 పనులు చేయాల్సి ఉంది. ఈ మిగతా పనులు కూడా ఈనెలాఖరులో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎంపిక చేసిన గ్రామాల్లో పనులు

వాటర్‌షెడ్ పనులకు సంబంధించి జిల్లాలో వాటర్ కంప్యూటర్ సెంటర్లు బద్వేలు, పులివెందుల, ఎర్రగుంట్ల ఉన్నాయి. ఇందులో బద్వేలు, బి.మఠం, బి.కోడూరు, సిద్దవటం, లింగాల, వేముల, తొండూరు, వీఎన్ పల్లె, ముద్దనూరు మొత్తం తొమ్మిది మండలాలు ఉండగా 37 గ్రామాల్లో ఈపీఏ కార్యక్రమం ద్వారా పనులు జరుగుతున్నాయి.

అవగాహన కోసం

సాధారణంగా అందరికీ అర్థమయ్యేది వాటర్‌షెడ్ అంటేనే చెక్ డ్యామ్ నిర్మాణం చేపడతారని అనుకుంటారు. కానీ వాటర్‌షెడ్ పథకంపై మరింత అవగాహన ప్రజల్లో కల్పించేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టడం వల్ల ప్రజలకు అతి సులభంగా ఈ పథకంపై అవగాహన ఏర్పడి మిగతా పనుల కోసం ముందుకు వస్తారన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. అయితే వ్యక్తిగత పనులకు ఈపీఏ కార్యక్రమంలో ఆస్కారం ఉండదు. కేవలం గ్రామాలకు, గ్రామ సముదాయాలకు మాత్రమే ఈ పనులు నిర్వహిస్తారు.

బడ్జెట్ ఇలా..

ప్రధానంగా వాటర్‌షెడ్‌లో వివిధ కార్యక్రమాల ద్వారా పనులను నిర్వహిస్తారు. మొత్తం బడ్జెట్ రూ. 87.14 కోట్లుగా ఉంది. అయితే ఈపీఏ కార్యక్రమ నిర్వహణకు రూ. 1.74 కోట్లు కేటాయించారు. ఇందుకుగాను 161 పనులు చేపట్టాల్సి ఉంది. రూ. 1.64 కోట్లకు పరిపాలన అనుమతులు రావడంతో రూ. 98.42 లక్షల నిధులకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. మిగతా పనులను ఈనెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ పథకం ద్వారా ఏడాదిలోపు ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఏయే పనులు చేస్తారంటే..

ప్రధానంగా గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులను ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తారు. గతంలో ఏ శాఖ నిర్వహించని పనులను మాత్రమే చేపడతారు. పశు వైద్యశిబిరాలు, సచివాలయాలు, ఆటోస్టాండ్లు, దేవాలయాలు, గ్రామ రచ్చబండలు, జనం గుమికూడే ప్రాంతాల్లో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా కోసం పైపులైన్ నిర్మాణం (ఆర్‌డబ్ల్యుఎస్ చేయని పనులను), హైస్కూళ్లలో డైనింగ్ హాళ్ల నిర్మాణం, పశువులకు నీటి తొట్ల ఏర్పాటు కూడా చేపడతారు. సోలార్ వీధి దీపాలు ఏర్పాటు విషయంలో 20 శాతం ప్రజలు వాటా చెల్లించాల్సి ఉండగా, మిగతా వాటాను ప్రభుత్వమే భరిస్తుంది.

పశు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరం



వాటర్‌షెడ్ పథకంలోని ఈపీఏ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రైతులకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరం. అంతేకాకుండా వాటర్‌షెడ్‌పై అవగాహన కూడా కలిగే అవకాశం లభిస్తుంది. – వెంకట కృష్ణయ్య, రైతు, వేముల

సిమెంటు బెంచీల ఏర్పాటు బాగుంది



వాటర్‌షెడ్ అంటే కేవలం చెక్‌డ్యాములు, నీటికి సంబంధించిన పనులను చేస్తారనేది మాకు అవగాహన ఉంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడంతో వాటర్‌షెడ్ పథకం మా గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. – సి.ఓబుల్‌రెడ్డి, పెద్దుళ్లపల్లె, బి.కోడూరు మండలం

పశువుల నీటి తొట్ల ఏర్పాటు ఉపయోగకరం



వాటర్‌షెడ్ ద్వారా గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడం వల్ల మేకలు, గొర్రెలు, ఇతర పశువుల దాహార్తిని తీరుస్తున్నాయి. ఇలాంటి ఉపయోగకరమైన పనులు చేపట్టడం అభినందనీయం. – డి.తిరుపాల్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్, కొనినేనిపల్లి మండలం, ముద్దనూరు మండలం

పనుల పూర్తికి చర్యలు



వాటర్‌షెడ్ పథకంలో భాగంగా పలురకాల పనులు నిర్వహిస్తున్నాం.వాటర్‌షెడ్ పై అవగాహన కల్పించేందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పనులను చేశాం మిగతా పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. – పి.యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి వర్షాలు కురిశాయి. కలసపాడులో అత్యధికంగా 35.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అవధూత కాశినాయన, ముద్దనూరు మండలాల్లో 26.8, పెద్దముడియంలో 12.2, పులివెందులలో 12, లింగాలలో 8.2, జమ్మలమడుగులో 7.4, వేములలో 6.2, మైలవరంలో 5.6, సింహాద్రిపురంలో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు కేవీకే వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అలాగే మైలవరం మండలం తొర్రివేములలో గంటకు 34.2 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినట్లు చెప్పారు. బద్వేల్ మండలం కొంగలవీడులో 27.7, ముద్దనూరు మంగపట్నంలో 25, ఖాజీపేట మండలం పత్తూరు లో 24.5, బికోడూరు పాయలకుంట్లలో 24, జమ్మలమడుగు, సిద్దవటం మండలం పెద్దపల్లిలో 23.1 కిలోమీటర్ల వేగంతో గాలు వీచాయన్నారు. రానున్న రెండు రోజుల్లో జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపారు.

మిరప పంట వర్షార్పణం



వర్షంలో తడిసిన మిరప పంట

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు ఆరబెట్టిన మిరప పంట పూర్తిగా తడిసిపోయిందని రైతు నల్లంశెట్టి పెద్ద నారాయణ వాపోయాడు. రైతు తనకున్న 4 ఎకరాల భూమిలో '' డబ్బి బ్యాడిగి అనే రకం మిరప పంట''ను సాగు చేశాడు. వచ్చిన 25 క్వింటాళ్ల మిరప పంటను రైతు పొలంలో ఆరబెట్టాడు. శనివారం రాత్రి భారీ వర్షం పడటంతో పొలంలో ఆరబెట్టిన మిరప పంట అంతా తడిసిపోయింది. ఈ రకం మిరప పంట కర్ణాటక రాష్ట్రం హుబ్లీ బ్యాడిగి మార్కెట్‌లో క్వింటా రూ. 60 వేలు ధర పలుకుతుందని రైతు తెలిపాడు. మిరప పంట తడిసి పోవడంతో దాదాపు రూ. 10 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు.

జనరంజకంగా జగనన్న పాలన

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డిలతో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా విద్యుత్, రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకురావడమే కాకుండా లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజల కోసమే శ్రమిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలన్నారు. అనంతరం అలవలపాడు గ్రామంలో ఎస్.పుల్లారెడ్డి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల పుల్లారెడ్డి కుమారుడు ఎస్.సిసింద్రీరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో జిల్లా ఉద్యోగులకు ప్రాధాన్యత దక్కింది. ఆదివారం తిరుపతి నగరంలో ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఎన్నికల్లో కడప 30 ఆంధ్రా బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చల్లా రాజగోపాల్ రెడ్డి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతో పాటు కడప 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్. సరస్వతి, ఉపాధ్యక్షులుగా కె. అంకయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎం. గౌస్‌బాషాలను ఎన్నుకున్నారు. వీరిని ఎన్‌సీసీ బెటాలియన్ సిబ్బంది, ఏఎన్‌ఓలు అభినందించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో నుంచి పుట్టిన వ్యవస్థే గ్రామ, వార్డు సచివాలయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఏదైతే మాట ఇచ్చారో దానికి కట్టుబడి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే దేశంలోనే అత్యంత పెద్దదైన సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి అమలు చేశారన్నారు. సచివాలయ ఉద్యోగుల ఎంపికలో కూడా ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా లక్షా 36 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంత పెద్ద వ్యవస్థ ఏర్పాటైన తర్వాత చిన్న చిన్న సమస్యలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రొబేషన్ డిక్లరేషన్ అయి పర్మినెంట్ ఉద్యోగులుగా మారిన తర్వాత కొన్ని సంఘాల ప్రలోభాపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి వారి మాటలు నమ్మరాదని సూచించారు. సచివాలయ వ్యవస్థపై అధ్యయనం జరుగుతోందన్నారు. స్వాత్ దేశ ప్రధాని నరేంద్రమోదీనే ఈ వ్యవస్థను కొనియాడారన్నారు. ఇటీవల తాము జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రంలో భాగంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో కోటి 45 కుటుంబాలను కలువగా, కోటి 10 లక్షల కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నాయన్నారు.

- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఏ సీఎం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా తాను దమ్మున్న నాయకుడిగా పేరు గడించారన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకమరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పర్తి నిఖిల్‌కృష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ బీఆర్ కిశోర్; రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మధు, జిల్లా అధ్యక్షులు పెంచలయ్య, ఏపీజీఈఎఫ్ చైర్మన్ శివారెడ్డి, కో చైర్మన్ వల్లం సుబ్బారెడ్డి, శివశేషాద్రిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, చంద్రకాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పెంచలయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగరాజు, జనరల్ సెక్రటరీలుగా చంద్రశేఖర్, బెన్ని శ్యామూల్, ట్రెజరర్‌గా రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా చిరంజీవి, ఈశ్వరయ్య, పుల్లయ్య యాదవ్, వంశీ, కేశవ్, కృపాకర్, ప్రశాంత్, గిరిధర్‌రెడ్డి, సురేష్‌కుమార్, అడిషనల్ సెక్రటరీలుగా నవీన్, శ్రీకర్‌రావు, జయరామిరెడ్డి, కొండయ్య, పి. రమణ, కస్తూరి రమేష్, రుషి,బాలాజీ జాయింట్ సెక్రటరీలుగా హరికృష్ణ, మంజుల, సునీత, సుజన్ కుమార్‌రెడ్డి, రఫీ, బాషలను ఎన్నుకున్నారు.

ఆట విడుపు



వేసవి సెలవుల్లో ఆటపాటలకు చోటిస్తే ఆనందోత్సాహాలకు అంతే ఉండదు. చిన్నారులకు క్రీడల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం పెంపొందించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న వేసవి క్రీడాశిబిరాలపై కథనం..

- వేసవి సెలవుల్లో ఆటలకు సన్నద్ధం
- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా వేసవి శిక్షణ శిబిరాలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు (ఫైల్)

కడప స్పోర్ట్స్ : ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు ఆటవిడుపు లభించింది. వేసవి సెలవులు రావడంతో పుస్తకాలను అటకెక్కించి ఎంచక్కా నచ్చిన క్రీడల్లో రాణించేందుకు సన్నద్ధమవుతున్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల శారీరక, మానసిక ధృడత్వంతో పాటు విద్యలోనూ చురుగ్గా రాణిస్తారని నిపుణులు సైతం స్పష్టం చేస్తున్నారు. మే నెల 1 నుంచి 30వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు.

55 శిబిరాల్లో శిక్షణ..

జిల్లా క్రీడాప్రాధికారసంస్థ/స్టెప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 55 వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 30 శిక్షణ శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో 25 శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు శాప్ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించనున్నారు. ఈ క్యాంపుల్లో క్రీడలకు సంబంధించిన ప్రాథమిక అంశాలు మొదలు, ప్రొఫెషనల్ క్రీడాకారులుగా రాణించేందుకు అవసరమయ్యే మెలకువలు నేర్పనున్నారు.

శిక్షణ ఇవ్వనున్న క్రీడాంశాలు: అథ్లెటిక్స్, క్రికెట్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, సెపక్‌తక్రా, యోగ, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, కిక్ బాక్సింగ్ క్రీడాంశాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శిక్షణ అందించనున్నారు. స్కేటింగ్, బ్యాడ్మింటన్ క్రీడాంశాలు మినహా మిగతా క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.

స్విమ్మింగ్ శిక్షణకు దక్కని చోటు..

వేసవికాలంలో ఎక్కువ మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు స్విమ్మింగ్ శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి కనబరుస్తారు. ప్రతిఏటా కడప డీఎస్ఏ మైదానంలోని స్విమ్మింగ్‌పూల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తూ వచ్చారు. అయితే ఈ సంవత్సరం స్విమ్మింగ్‌పూల్ ను ప్రైవేట్‌పరం చేయడంతో అధికారులు సైతం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించలేక జాబితా నుంచి తొలగించారు. దీంతో తల్లిదండ్రుల్లో నిరుత్సాహం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్విమ్మింగ్ శిక్షణను ప్రారంభించాలని క్రీడాకారులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



శాప్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మే 1 నుంచి 30వ తేదీ వరకు నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. 8 నుంచి 14 సంవత్సరాలలోపు విద్యార్థులు, చిన్నారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. – సి. సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ, కడప

55 శిక్షణ శిబిరాలు నిర్వహణ..



జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 30, పట్టణ ప్రాంతాల్లో 25 మొత్తం 55 వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఈ శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయి. ఒకటి, రెండు క్రీడాంశాలు మినహా అన్ని క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నాం. – ఎన్.వి.పి. అమృత్‌రాజ్, చీఫ్ కోచ్, డీఎస్ఏ, కడప

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండలంలోని మాలెపాడు గ్రామానికి చెందిన గూటం ఆదిత్య (31) అనే యువకుడు ఇంటిలో ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కలమల్ల ఎస్ఐ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. పెద్ద ఎత్తున అప్పులు చేసి వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఇంటి మేడ మీద బెడ్ రూంలో ఆత్మహత్య చేసున్నాడు. మృతుడి భార్య గూటం సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చక్రాయపేట : మండలంలోని ఎర్రబొమ్మనపల్లె గ్రామం కోలెకణం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అజమతుల్లా(45) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య సుమీయ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి పట్టణానికి చెందిన అజమతుల్లా ఉదయం 5 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంలో పెండ్లిమర్రి మండలం నందిమండలానికి తాటి ముంజల నిమిత్తం బయలుదేరాడు. కోలేఖనం వద్దకు రాగానే స్కూటీ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో వ్యక్తి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగంగా రావడంతో ప్రమాదం జరిగిందని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతదేహాన్ని బంధువులు, కుటుంబీకులకు అప్పగించారు.

ఎనర్జీ అసిస్టెంట్‌కు గాయాలు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు సచివాలయంలో పని చేసే ఎనర్జీ అసిస్టెంట్ హరి విద్యుత్‌షాక్‌కు గురికావడంతో గాయాలయ్యాయి. ఆదివారం పుల్లారెడ్డిపల్లె వద్ద విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతుండగా మరో లైన్ నుంచి విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. రెండు చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా 108 వాహనంలో నంధ్యాల శాంతిరామ్ హాస్పిటల్‌కు తరలించారు. గత నెలలో కూడా ఒక ఎనర్జీ అసిస్టెంట్ విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలై రెండు చేతులు కోల్పోయాడు.

ఏడుగురి అరెస్ట్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి రెండు గ్రూప్‌ల మధ్య జరిగిన ఘర్షణ కేసులలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 28న పట్టణానికి చెందిన హబీబ్, షారూక్ అనే వ్యక్తుల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ జరిగి ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ ఘటనలో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు 16 మందిపై కేసు నమోదు చేశామని, ఒక వర్గానికి చెందిన నలుగురిని, మరో వర్గానికి చెందిన ముగ్గురిని ఆదివారం అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరిచామని, మిగిలిన వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ళు హరి, రవి, రామయ్య పాల్గొన్నారు.

బ్రహ్మయ్య పండుగ.. ఆనందం నిండుగ

- కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- బ్రహ్మంగారిమఠానికి పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ


దీక్షబంధనాలంకారోత్సవంలో దర్శనమిస్తున్న స్వామి వారు


బ్రహ్మంగారిమఠంలో భక్తజన సందడి


క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి పండుగను భక్తజనం ఆనందంగా జరుపుకొన్నారు. బ్రహ్మంగారు క్రీ.శ.1693నకు సరియగు శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఈ ఏటా ఈ రోజును భక్తులు పర్వదినంగా జరుపుకొంటున్నారు. ఈ ఏడాది ఆదివారం ఉమ్మడి జిల్లాల్లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన ప్రాంతమైన బ్రహ్మంగారిమఠంలో ఈ సందర్భంగా ఆరాధన గురుపూజోత్సవాలు నాలుగు రోజుల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలి వచ్చారు. క్యూలైన్‌లు కిటకిటలాడాయి. 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' అంటూ వారు వేడుకున్నారు. స్వామి సజీవ సమాధిని దర్శించుకుని తరించారు. వీరబ్రహ్మేంద్రస్వామి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. బ్రహ్మంగారిమఠంలో ఎక్కడ చూసినా భక్తజనం కనిపించారు.

కమనీయంగా దీక్షాబంధనాలంకారోత్సవం

తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం దీక్షబంధనాలంకారోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. స్వామి యోగానిద్రలో ఉన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని దీక్షలో దర్శించే అలంకరణను దీక్షబంధనాలంకారోత్సవం అంటారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గం వాసుదేవపురానికి చెందిన ఇరగంరెడ్డి మూలింటి నాగిరెడ్డి, ఆయన సతీమణి వెంకటమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు. అనంతరం కాలజ్ఞానంలోని కొన్ని తత్వాలను మఠం ఆస్థాన పండితులు పెదపాటి నాగేశ్వరరావు వివరించారు.

వైభవంగా నందివాహనోత్సవం

రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందివాహన గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి స్వామి నివసించిన ఇంటి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కందిమల్లయ్యపల్లె పుర వీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి కమలాపురం నియోజకవర్గం పెద్దపుత్తకు చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను దాతలు పెద్ద ఎత్తున చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాలకు చెదిన విద్యార్థులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో ఐదో రోజైన సోమవారం సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధికారులతోపాటు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరు అవుతున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జరిగిన గుడి ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్పం, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భక్తగాన లహరి, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి సింహ వాహన గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.


ఉపన్యాస కార్యక్రమంలో శ్రీ వెంకటాద్రిస్వామి, గోవిందస్వామి


నృత్యం చేస్తున్న కళాకారులు

'కొలువు'ను కాదనడానికి కారణం ఏమిటో..?

- మొత్తం 89 మందికి 'స్టాఫ్ నర్స్'ల నియామకానికి పిలుపు
- 25 మంది గైర్హాజరు
- బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూస్తాయనే భయమా?

పిలిచి ప్రభుత్వ కొలువిస్తామంటే ఎవరైనా సరే ఎగిరి గంతేస్తారు. మహా భాగ్యమని 'నియామక' పత్రాన్ని కళ్లకద్దుకుంటారు. అయితే కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. అర్హులైన వారికి స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగాలిస్తామని కౌన్సెలింగ్‌కు రమ్మంటే పెద్ద సంఖ్యలో డుమ్మా కొట్టడం గమనార్హం. వారంతా దాదాపుగా బోగస్ సర్టిఫికెట్స్ పొందిన వారేనా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కడప రూరల్: కడప కేంద్రంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో చేపడుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. మొదట జనవరిలో జరిగిన స్టాఫ్ నర్స్‌ల నియామకానికి సంబందించి, ఆ శాఖ పరిధిలోని జోన్-4 రాయలసీమ జిల్లాల నుంచి 11 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం 291 మందికి స్టాఫ్ నర్స్‌గా నియామకాలను చేపట్టారు. తరువాత అందులో 16 మంది బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన వారు ఉన్నారని తేలారు. వారిపై చర్యలకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తాజాగా చేపట్టిన నియామకాల్లో..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ శాఖ అధికారులు మళ్లీ శనివారం స్టాఫ్ నర్స్‌ల నియామకంను చేపట్టారు. జనవరిలో వచ్చిన 11 వేల దరఖాస్తుల నుంచే అభ్యర్థుల మెరిట్ జాబితాను సిద్ధం చేశారు. మొత్తం 89 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. అందులో రెండు పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద రిజర్వ్ చేశారు. మిగిలిన మొత్తం 87 మందికి గాను కౌన్సెలింగ్‌కు 56 మంది హాజరయ్యారు. వారంతా నియామక పత్రాలను పొందారు. మిగతా 25 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు గైర్హాజరు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే తాజాగా చేపట్టిన నియామకాల్లో కూడా రెండు బోగస్ సర్టిఫికెట్స్ బయట పడ్డాయి. వారిద్దరు కౌన్సెలింగ్‌కు గైర్హాజరయినట్లుగా సమాచారం. అంటే ఆ కారణాల చేతనే ఈ 25 మంది అభ్యర్థుల్లో అధిక భాగం కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని అందరూ బావిస్తున్నారు.

నెలకు 38 వేల వేతనం కాదనుకుంటారా?

తాజాగా చేపట్టిన స్టాఫ్ నర్స్‌ల నియామకాల్లో ఒకరు నెలకు రూ 38 వేల వేతనంను పొందుతారు. అదే నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పని చేసే స్టాఫ్ నర్స్‌లకు నెలకు రూ.28 వేలు వస్తుంది. అంటే స్టాఫ్ నర్స్‌లు ఎవరైనా సరే దాదాపుగా రూ.38 వేల వేతనం వైపే మొగ్గు చూపుతారు. కాగా ఎన్‌హెచ్‌ఎం కింద పని చేసే నర్స్‌లు కూడా రూ.38 వేల వేతనం లభించే స్టాఫ్ నర్స్‌ల పోస్టులకు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. అలాంటి వారు ఉంటే శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు నిరభ్యంతరంగా హాజరు కావచ్చు. నచ్చిన చోట పోస్టింగ్ రాకుంటే యథావిధిగా ఎన్‌హెచ్‌ఎం కింద స్టాఫ్ నర్స్‌గానే కొనసాగవచ్చు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరయిన 25 మందిలో ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్స్‌గా పని చేసేవారు ఉండొచ్చు.. ఉండకపోవచ్చు. మరే కారణాలైనా కావచ్చు. అయితే అందులో చాలా మంది వద్ద బోగస్ సర్టిఫికెట్స్ ఉండడం వలనే కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారంపై విచారణ చేపట్టి, కారకులైన వారిని శిక్షించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఒరిజనల్ సర్టిఫికెట్స్ చూస్తే తెలుస్తుంది

ఈ కౌన్సెలింగ్‌కు 25 మంది హాజరు కాలేదు. ఎందుకు హాజరు కాలేదో తెలియదు. వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను పరిశీలిస్తేనే వాస్తవం తేలుతుంది. నిబంధనల ప్రకారమే నియామకాలను చేపట్టాం. ఏవైనా లోపాలు ఉంటే కారకులైన వారిపై చర్యలు చేపడుతాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

ఘనంగా వాసవీ మాత జయంతి


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం శ్రీవాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. వేకువజామున విశేష అభిషేకాలు, అర్చనలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మహాప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. గణపతి, నవగ్రహ, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతిగా పట్టువస్త్రాలు, హోమ ద్రవ్యాలను అర్పించారు. బంగారు శ్రీచక్ర మేరువుకు పూజలతోపాటు, అమ్మవారి మూల విరాట్‌ను విశేషంగా సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి వజ్రపుకిరీటంతో అలంకరించారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్యులు సామూహికంగా లక్షకుంకుమార్చన నిర్వహించారు. పూజాకార్యక్రమానంతరం భక్తులకు ప్రసాద వినియోగం జరిగింది.

ఇళ్లపట్టాల పంపిణీ

స్థానిక గాధంశెట్టి చెంచయ్య, పద్మావతమ్మ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో 50 మంది నిరుపేద ఆర్యవైశ్యులకు ఒక్కొక్కరికి 1.5 సెంట్ల చొప్పున ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో సభ ఆధ్వర్యంలో అర్హులైన పేద ఆర్యవైశ్యులకు ఇళ్లపట్టాలను అందించామన్నారు. బుశెట్టి ధనలక్షుమ్మశ్రీరాములు చారిటుల్ ఆధ్వర్యంలో బుశెట్టి కుటుంబీకులు మూడు ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. అలాగే ఇళ్లనిర్మాణానికి బ్యాంకు లోన్లు, దాతల సహకారం అందించేందుకు ఆర్యవైశ్యసభ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, న్యాయవాది సీవీ సురేష్, వంకధార వీరభద్రయ్య, పోలేపల్లి రాజా పాల్గొన్నారు.

కడప డీఎస్పీగా ఎండీ షరీఫ్ బాధ్యతలు


కడప నూతన డీఎస్పీగా బాధ్యతలను చేపడుతున్న ఎండీ షరీఫ్

కడప అర్బన్ : కడప సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా ఆదివారం ఉదయం ఎం.డి షరీఫ్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఆయనను సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

డీఎస్పీ ఎండీ షరీఫ్ ప్రస్థానం..

కడప డీఎస్పీ షరీఫ్ తిరుపతి వాసి. 1995 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ. పీఎస్ఐగా పూర్తి చేసిన తరువాత 1996లో మొదటి సారిగా ఎస్ఐగా కడప టూటౌన్ ఎస్ఐగా విధుల్లో చేరారు. 2007లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన మొదట ప్రొద్దుటూరు అర్బన్ సీఐగా విధులను సమర్థవంతంగా నిర్వహించారు. తరువాత తిరుపతి సీఐడిలో ఐదేళ్లు పని చేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి లభించింది. తరువాత అప్పటి నుంచి ఇప్పటివరకు తిరుపతి పీటీసీలో డీఎస్పీగా విధులను నిర్వహించారు.

డిప్యూటీ సీఎంను కలిసి డీఎస్పీ..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ శాఖామంత్రి ఎస్.బి. అంజాద్ బాషాను క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కడప నూతన డీఎస్పీ ఎండీ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. తరువాత కడప నగర మేయర్ కె. సురేష్‌బాబును మర్యాదపూర్వకంగా కడప నగరపాలక సంస్థలో కలిశారు. అంతకు ముందుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కలిశారు.

కేవీకేలో మన్ కీ బాత్ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రపంచ వ్యాప్తంగా ప్రసారమయ్యే మన్ కీ బాత్ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల నుంచి 80 మంది రైతులతోపాటు కేవీకే శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ నలుమూలల్లోని ప్రజలలో ఉన్న నైపుణ్యాలను, కర్తవ్య దీక్షను, దేశానికి వారు చేస్తున్న సేవలను వెలుగులోకి తెచ్చి తద్వారా మిగిలిన వారిలో చైతన్యం కలిగించారన్నారు. దేశంలోని స్వయం సహాయక బృందాల విజయాలు, నూతన ఆవిష్కరణలు, ఆత్మ నిబ్బర భారత్, నదుల పునరుద్ధరణ పరిరక్షణ, నారీ శక్తి, బేటి బచావో బేటి పడావో, ఏకో ఫ్రెండ్లీ టెర్రకోట కప్పుల తయారీ, మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్, స్వచ్ఛభారత్, సమాజంలో మహిళా అభ్యుదయం వంటి అంశాలపై కూడా అవగాహన తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, ప్రశాంతి, లావణ్య, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, స్వామిచైతన్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందం 'పది'లం

రిమ్స్ 2కె7 ఎంబీబీఎస్ బ్యాచ్ వైద్య విద్యార్థుల సమ్మేళనం


కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో వైద్యులతో పాటు కలిసిన 2కె7 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో 2007 (2కె7) బ్యాచ్‌లో 149 మంది వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరి, 2013లో పూర్తి చేశారు. వారంతా ఈనెల 29న, ఆదివారం ప్రత్యేకంగా కలిశారు. ఆదివారం కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణంలో కలిసి అప్పటి కళాశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి వైద్య నిపుణులు, వైద్య అధ్యాపకులతో తమ అనుబంధాలను పంచుకున్నారు. 149 వైద్యులుగా బయటి ప్రపంచానికి వెళ్లిన వారంతా పీజీ వైద్యను పూర్తి చేసి వివిధ కేటగిరిలలో వైద్యవృత్తులను కొనసాగిస్తున్నారు. వారిలో 86 మంది రెండు రోజుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యాచ్‌కు సంబంధించిన వారు ఇండియన్ ఆర్మీలో ఏడుగురు డాక్టర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. యు.ఎస్‌లో ఏడుగురు, యు.కెలో ఇద్దరు, ఒమన్‌లో ఒకరు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 8 మంది, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 26 మంది వైద్యులుగా విధులను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్‌లలో 70 మంది వైద్యవృత్తిలో వున్నారు. ఆదివారం కడప రిమ్స్‌లో నిర్వహించిన 'గెట్ టుగెదర్ ' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అప్పటి, ఇప్పటి వైద్యులు డాక్టర్ ఎస్.సీ ఓబులేసు, డాక్టర్ టి. గిరిధర్, డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, డాక్టర్ జంగం వెంకటశివ, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సంపత్, డాక్టర్ చంద్రబాబు, డాక్టర్ సునీల్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ మృదుల, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ కోటకొండ మనోహర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ బ్యాచ్ హయాంలోనే డైరెక్టర్‌గా వున్న డాక్టర్ సిద్ధప్ప గౌరవ్ సహకారంతో అప్పటి వైద్యులందరి కృషితో జాతీయ స్థాయిలో రిమ్స్‌కు గుర్తింపు వచ్చేలా కడప రిమ్స్ మెడిఫెస్ట్, రిమ్స్ మెడికాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తరువాతనే 2013 నుంచి రిమ్స్‌కు పీజీ సీట్లు మంజూరు కావడం ఆరంభమయ్యాయి.

సమష్టి కృషితో అభివృద్ధి



కడప రిమ్స్‌లో 2007లో చేరి ఎంబీబీఎస్ విద్యను 2013లో పూర్తి చేశాం. పది సంవత్సరాల తరువాత ఇక్కడకు చేరిమా వంతుగా రిమ్స్‌కు, ప్రస్తుత వైద్య విద్యార్థులకు ఏమి అవసరమో చర్చించి అభివృద్ధికి సహకరిస్తాం. ఇక్కడ ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత ఛండీఘర్‌లోని పిజిఐఎంఈఆర్‌లో అనస్తీషియా అండ్ ఇన్సెంటివ్ కేర్‌లో పీజీని పూర్తి చేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్రిటికల్ కేర్ కన్సల్టంట్‌గాను, చెన్నై ఏడిఆర్ ఫ్లెక్సాస్ అకడమిక్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్నాను. మా బ్యాచ్ వారంతా దాదాపు 121 మంది వివిధ కేటగిరిలలో స్థిరపడ్డారు. ఈ గెట్ టుగెదర్ ద్వారా దాదాపు 86 మందితో కలవడం ఆనందంగా వుంది. భవిష్యత్తులో కడప రిమ్స్‌కు, విద్యార్థులకు ఎంతో సహకరిస్తాం.

– డాక్టర్ ఎం.శరణ్‌కుమార్‌రెడ్డి, 2కె7 బ్యాచ్

ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా



కడప రిమ్స్‌లో 2కె7 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ చేరి వైద్య విద్యను పూర్తి చేశాను. కడప రిమ్స్‌లో ప్రస్తుతం ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులను నిర్వర్తిస్తూ, బ్లడ్ బ్యాంక్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. ఇక్కడే చదివి, ఇక్కడే విధులను నిర్వర్తించడం, పేద ప్రజలకు వైద్య సేవలను అందించడం ఎంతో ఆనందంగా వుంది.

– డాక్టర్ ప్రవీణ్

వైద్య వృత్తిలో రాణిస్తున్నా..



మాది తిరుపతి. మా అమ్మానాన్నలు డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ మారుతిలు వైద్యవృత్తిలోనే పేరు తెచ్చుకుంటున్నారు. వారి ప్రోత్సాహంతోనే కడప రిమ్స్‌లో 2కె7 బ్యాచ్‌లో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించేందుకు చేరాను. తిరుపతి స్విమ్స్‌లో ట్రామా అండ్ అర్థోపెడిక్స్ విభాగంలో పీజీ వైద్య విద్యను పూర్తి చేశాను. ప్రస్తుతం బెంగుళూరులోని సంజయ్‌గాంధీ ట్రామా అండ్ అర్థోపెడిక్స్ కేర్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను.

– డాక్టర్ బి.అపర్ణ